క్లుప్తంగా

రైతులకు వరి మినీ కిట్ల పంపిణీ



వరి మినీ కిట్లను పంపిణీ చేస్తున్న ఏరువాక కో ఆర్డినేటర్ వెంకట నరసింహారావు

రాజమహేంద్రవరం రూరల్: చిరు సంచుల పథకంలో భాగంగా రాష్ట్రంలోని వివిధ పరిశోధన స్థానాల్లో ఎంపిక చేసిన వివిధ నూతన వరి మినీ కిట్లను రైతులకు పంపిణీ చేస్తున్నట్లు జిల్లా ఏరువాక కో ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు తెలిపారు. హుకుంపేటలోని సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో మంగళవారం వీటిని రైతులకు అందజేశారు. బాపట్ల నుంచి బీపీటీ 3284, మార్టేరు నుంచి ఎంటీయూ 1443, రాగోలు నుంచి ఆర్జీఎల్ 7030, 7034, 70 38, 7039, 7045 అనే సార్వా వరి రకాలను ఈ ఖరీఫ్ సీజన్‌లో పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఏడీఏ శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ అధికారి సూర్య రమేష్, వ్యవసాయ విస్తరణ అధికారి వేణుమాధవ్, పలువురు రైతులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఐదుగురి ఎంపిక

కడియం: మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి ట్రిపుల్ ఐటీకి ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ఎంఈవో మణికుమార్ తెలిపారు. మాధవరాయుడుపాలెం ఉన్నత పాఠశాల నుంచి షమ్మీలీలా మేఘన, పడాల అవంతిక, సంగీత భ్రమరాంబిక, కడియపులంక హైస్కూలు నుంచి ఎస్.భాగ్యలక్ష్మి, దుళ్ల నుంచి టి.సాయిదుర్గ దివ్యశ్రీ అర్హత పొందారన్నారు. ఈ సందర్భంగా వారిని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు అభినందించారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలి

బిక్కవోలు: మూడేళ్ల నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని సర్పంచ్ వాసంశెట్టి రవికుమార్ అన్నారు. కొమరిపాలెంలో మంగళవారం అంగన్‌వాడీ పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సిబ్బంది మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటలతో కూడిన అందిన విద్య అందిస్తున్నామన్నారు. చదువుతో పాటు పౌష్టికాహారం కూడా అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ద్వారంపూడి వెంకటరెడ్డి, సూపర్‌వైజర్ యు.పద్మ,శాంతి, రత్నకుమారి, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకాలు

బిక్కవోలు: గ్రామంలోని కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రామలింగ భాస్కర్, సిబ్బంది ప్రసాద్, రవి, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలి

సీతానగరం: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని, వరి విత్తనాలను తప్పని సరిగా శుద్ధి చేసుకోని, ఆకుమడులు వేసుకోవాలని మండల వ్యవసాయశాఖాధికారి ఎ.గౌరీదేవి రైతులకు సూచించారు. ఆమె మంగళవారం రాపాకలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ నారుమడికి సరైన ఎరువుల యాజమాన్యం పాటించాలన్నారు. వరి ఆకు చిగురులు తుంచి నాటాలని, దీనివల్ల కాండం తొలుగు పురుగును 30 రోజుల వరకూ నివారించవచ్చన్నారు. నల్గొండ పరిధిలో వరి ఆకుమడులను పరిశీలించి, రైతులు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈవో గురప్రియ, వీపీఏ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల :	28 ఇయర్స్ లేటర్
సూర్యమినీ :	8 వసంతాలు
సూర్యప్యాలెస్ :	సితారే జమీన్ పర్
స్వామి :	కుబేర
అనుశ్రీ :	కుబేర
శివజ్యోతి :	కుబేర
ఊర్వశి :	భైరవం
మేనక :	సింగిల్
రంభ :	హౌటు ట్రయిన్ యువర్ డ్రాగన్
అప్సర :	సితారే జమీన్ పర్
అశోక :	8 వసంతాలు
నామవరం	
వీఎస్ మహల్ :	కుబేర
ధవళేశ్వరం	
మురళీకృష్ణ :	కుబేర
కడియం	
వెంకటసూర్య :	కుబేర

ప్రయాణం నరకమే..

- అధ్వానంగా రహదారి
- వాహన చోదకుల అవస్థలు



ధవళేశ్వరం క్వాయర్ బోర్డు ఎదురుగా ప్రధాన రహదారి

ధవళేశ్వరం: ఈ రోడ్డును చూసి ఇదేదో పల్లెటూరు అనుకుంటే తప్పులో కాలేసినట్లే.. రాజమహేంద్రవరం నగరానికి అనుకుని ఉన్న మేజర్ పంచాయతీ ధవళేశ్వరం గ్రామ ప్రధాన రహదారి దుస్థితి ఇది. స్థానిక గాయత్రి ఇసుక ర్యాంపు నుంచి ప్రతి రోజూ వందల సంఖ్యలో తిరుగుతున్న లారీలతో క్వాయర్ బోర్డు ఎదురుగా ఉన్న రోడ్డు అధ్వానంగా మారింది. భారీ గుంతలతో ఈ ప్రాంతంలో ప్రయాణించాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. చిన్నపాటి వర్షానికి సైతం ఈ దారిలో రాకపోకలు సాగించడానికి ఇబ్బంది పడాల్సిందే.

వాహనచోదకుల అవస్థలు

రోడ్డుపై భారీ గుంతలు పడటంతో ద్విచక్ర వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల గాయత్రి ర్యాంపునకు వెళ్లే రోడ్డుపై గుంతలలో రాళ్లు వేశారు. దీనివల్ల ద్విచక్ర వాహనదారులకు మరిన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. వందల సంఖ్యలో ప్రతిరోజూ ఇసుక లారీలు ఈ ప్రాంతం మీదుగా ప్రయాణించి రోడ్లను అధ్వానంగా మార్చుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. దీనిపై స్థానికులు ఎన్నిసార్లు మొత్తుకున్నా ఫలితం శూన్యం.

ప్రత్యేక దృష్టి సారించాలి

అధ్వానంగా మారిన ధవళేశ్వరం ప్రధాన రహదారి రోడ్డును వెంటనే అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. వర్షాకాలం వస్తుండటంతో పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ ఇసుక లారీలు వందల సంఖ్యలో ప్రతి రోజూ ఈ మార్గం మీదుగా ప్రయాణిస్తుండటంతో భవిష్యత్తులో ఇబ్బందులు లేకుండా పటిష్టంగా రోడ్డును నిర్మించాలని సూచిస్తున్నారు. అదే విధంగా క్వాయర్ బోర్డు నుంచి గాయత్రి ఇసుక ర్యాంపునకు వెళ్లే గోదావరి గట్టు రోడ్డును అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. ఇక్కడ పెద్ద రాళ్లు రోడ్డుపై వేయడంతో ద్విచక్ర వాహనదారులు ఈ మార్గం మీదుగా గోదావరి గట్టు రోడ్డుకు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. అదే విధంగా ధవళేశ్వరం బాలుర హైస్కూల్ సమీపంలో రోడ్డుపై పడిన భారీ గుంతలను పూడ్చాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



గాయత్రి ఇసుక ర్యాంపునకు వెళ్లే గోదావరి గట్టు రోడ్డు

ఆ ప్రక్రియ పూర్తయ్యాకే బదిలీలు చేపట్టాలి



ఎంపీడీవో రమేష్‌కు వినతిపత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు

కడియం: రేషనైలేజేషన్ ప్రక్రియ పూర్తయ్యాకే బదిలీలు చేపట్టాలంటూ ఎంపీడీవో కె.రమేష్‌కు మంగళవారం సచివాలయ ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలు చేపట్టిన విషయం విదితమే. అయితే ఏ శాఖలో ఎన్ని ఖాళీలు ఉన్నాయన్నది తేలకుండా బదిలీలు చేపట్టడంతో తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే సొంత మండలంలోనే తమకు పోస్టింగులు ఇచ్చే అంశాన్ని కూడా పరిశీలించాలని కోరారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం సిటీ: స్వర్ణాంధ్ర సేవాసంస్థ ఆధ్వర్యంలో ఇస్తున్న కుట్టు, మగ్గం, బ్యూటీషియన్, కంప్యూటర్ కోర్సులలో శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ కుట్టు, మగ్గం కోర్సులలో మహిళలకు మాత్రమే ప్రవేశం ఉంటుందన్నారు. కనీసం ఏడో తరగతి చదువుకున్న మహిళలు అర్హులన్నారు. కంప్యూటర్ కోర్సులకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన మహిళలు, పురుషులు హాజరు కావచ్చన్నారు. బ్యూటీషియన్ కోర్సులలో మహిళలందరికీ ప్రవేశం ఉంటుందన్నారు. ఈనెల 30వ తేదీ సోమవారం నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఆ సమయంలో మెటీరియల్, మధ్యాహ్న భోజనం ఉచితంగా అందిస్తామన్నారు. శిక్షణానంతరం సర్టిఫికెట్లు, జ్ఞాపికలు బహూకరిస్తామన్నారు. ఆసక్తి కలవారు లాలాచెరువులోని స్వర్ణాంధ్ర సంస్థను 98498 47489 నంబర్ ద్వారా సంప్రదించాలని కోరారు.

ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నిధులు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ తిరుపణ్యం

సీటీఆర్ఐ: స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కేంద్ర ప్రభుత్వం పీఎం ఉష స్కీమ్ కింద రూ.4,99,94,500 నిధులు మంజూరు చేసిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బీవీ తిరుపణ్యం అన్నారు. కళాశాల ఆవరణలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆ నిధుల్లో రూ.నాలుగు కోట్లను సివిల్ వర్క్స్, 12 తరగతుల నిర్మాణానికి వినియోగిస్తారన్నారు. రూ.93,94,500లను సైన్స్‌ల్యాబ్ ఎక్విప్మెంట్, కంప్యూటర్స్, జిరాక్స్ మెషీన్ కోసం ఖర్చు చేస్తారని తెలిపారు. మరో రూ.6 లక్షలను సెమినార్లు, వర్క్ షాపులు, ప్రాజెక్టు ప్రచురణలకు వినియోగిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ పీఏ రాజబాబు, డాక్టర్ బి.రమణమూర్తి, జి.శరత్ బాబు, బీహెచ్‌పీవీఎస్ మూర్తి, డి.మధులత, ఎస్.ఇందిర, డాక్టర్ పీవీబీ సంజీవరావు పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలి



ఆర్‌డీఓ కృష్ణనాయక్‌కు వినతి పత్రం అందజేస్తున్న న్యాయవాదులు

సీటీఆర్ఐ: కేంద్ర ప్రభుత్వం తక్షణమే న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలని అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్నాలకోట వెంకటేశ్వరరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆర్‌డీఓ కృష్ణ నాయక్‌కు వినతిపత్రం అందించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో న్యాయవాదులపై దాడులు, హత్యలు జరుగుతున్నాయన్నారు. వీటిని అరికట్టడానికి న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలన్నారు. ఇటీవల బాపట్ల జిల్లా రేపల్లె బార్ అసోసియేషన్‌కు చెందిన సీనియర్ న్యాయవాది కొండపల్లి శ్రీనివాసరావును దుండగులు హత్య చేసి, కృష్ణా నది ఒడ్డున పడవేశారన్నారు. ఈ ఘటనను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం సదరు న్యాయవాది మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించడంతోపాటు, న్యాయవాది కుటుంబాన్ని ఆదుకోవాలని అన్నారు. సొసైటీ రాష్ట్ర సహ కార్యదర్శి బీరా అరుణ్ కుమార్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో కొన్ని సినిమాల్లో న్యాయవాదులను, న్యాయవ్యవస్థను కించపరిచే విధంగా మాట్లాడుతున్నారని, తక్షణం వీటిని నిరోధించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమం రాష్ట్ర ప్రతినిధులు వాకా రామ్మోహన్, కూనరెడ్డి హేమంత్ శ్రీనివాస్, శ్రీలలిత, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌డీఏతో ఉన్నత శ్రేణి ఉద్యోగం



జయంత్ దొరను అభినందిస్తున్న తల్లిదండ్రులు

సీటీఆర్ఐ: దేశానికి సేవ చేసే అవకాశం, ఉన్నత శ్రేణి ఉద్యోగం, ఉత్తమ భవిష్యత్తుకు నేషనల్ డిఫెన్స్ అకాడమి (ఎన్‌డీఏ) అత్యుత్తమ ఎంపిక అని భారత వైమానిక దళంలో లాజిస్టిక్స్ విభాగంలో ఫ్లయింగ్ ఆఫీసర్‌గా ఉద్యోగాన్ని సాధించిన పోతంశెట్టి జయంత్ దొర అన్నారు. అతడు ఉద్యోగం సాధించిన సందర్భంగా కుటుంబ సభ్యులు తమ సంతోషాన్ని మీడియాతో పంచుకున్నారు. భాస్కర్ నగర్ గోశాల గేటు ఎదుట రోడ్డులోని వారి స్వగృహం వద్ద మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జయంత్ దొర మాట్లాడారు. ఇంటర్మీడియట్ తర్వాత ఎన్‌డీఏలో సీటు సాధిస్తే చదువుతో పాటు ఉన్నత ఉద్యోగం సాధించడానికి మంచి అవకాశం ఉందన్నారు. తనకు చిన్నప్పటి నుంచి ఎయిర్‌ఫోర్స్‌లో చేరాలన్నది లక్ష్యమన్నారు. ఎన్‌డీఏలో మూడేళ్లు, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీ (ఐఏఏ)లో ఏడాది శిక్షణ తర్వాత (సర్వీస్ సెలక్షన్ బోర్డు) ఎస్ఎస్‌బీలో ఎంపికై, ఏడాది పాటు పైలెట్ శిక్షణ తీసుకోవడం జరిగిందన్నారు. పైలెట్ ఆఫీసర్ ఉద్యోగం సాధించడం ద్వారా ఎయిర్‌ఫోర్స్‌లో చేరి దేశానికి సేవ చేయాలన్న తన స్వప్నాన్ని నెరవేర్చుకున్నానన్నారు. జయంత్ దొర తండ్రి శ్రీనివాస్ దొర మాట్లాడుతూ తమ కుమారుడు ప్రతిష్టాత్మక ఉద్యోగం సాధించడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు, ఆయన మిత్ర బృందం జయంత్ దొరను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

ఆర్ట్స్ కళాశాల విద్యార్థిని ప్రతిభ



అనూషను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే

కంబాలచెరువు: ఆర్ట్స్ కళాశాల ఎమ్మెస్సీ విద్యార్థిని ఎ.అనూష తాడేపల్లిగూడెంలోని నిట్‌లో పీహెచ్‌డీ ప్రవేశం పొందిందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే మంగళవారం తెలిపారు. ఆమె పరిశోధన, విద్యా రంగాల్లో ఇతర విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా అనూషను కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

అఖండ గోదావరి ప్రాజెక్టుకు రేపు శంకుస్థాపన



ఎస్పీ నరసింహ కిశోర్‌తో మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్

సీటీఆర్ఐ: రాజమహేంద్రవరంలో అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టుకు గురువారం శంకుస్థాపన జరగనుందని, అనంతరం దివాన్ చెరువులో అటవీ అకాడమీకి భూమిపూజ జరుగుతుందని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఆయన మంగళవారం రాజమహేంద్రవరంలో విలేకరులతో మాట్లాడారు. అఖండ గోదావరి ప్రాజెక్టు శంకుస్థాపనకు కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి వస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత ఏర్పాట్లను ఎస్పీ నరసింహ కిశోర్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం రాజవోలు రహదారిలోని సైన్స్ మ్యూజియాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్నరాముడు, ఎస్పీ డి.నరసింహ కిశోర్‌తో కలిసి మంత్రి పరిశీలించారు.

5న జాతీయ లోక్ అదాలత్



ఎక్సైజ్ అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

కంబాలచెరువు: జిల్లా ప్రధాన న్యాయస్థాన ఆవరణలో ఎక్సైజ్ అధికారులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత మంగళవారం సమావేశం నిర్వహించారు. జూలై 5వ తేదీన జిల్లా వ్యాప్తంగా జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అధిక మొత్తంలో రాజీ పడదగిన ఎక్సైజ్ కేసులు పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలను రాజీ మార్గంలో పరిష్కరించుకునేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వై.కృష్ణకుమారి, జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి.నాగ రాహుల్, రంపచోడవరం ఇన్‌చార్జి అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.ఇంద్రజిత్, రంపచోడవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆవస్థలు తీరేనా..

- నత్తనడకన ఆవ కాలువలో పూడికతీత
- ప్రారంభమైన వర్షాకాలం
- పూడికను గ్రావెల్ రోడ్డుపై వేయడంతో రాకపోకలు బంద్
- నేతాజీ నగర్ కాలనీ వాసులకు తప్పని ఇక్కట్లు

రాజమహేంద్రవరం రూరల్: వర్షాకాలంలో హుకుంపేట, బొమ్మూరు గ్రామంలోని నేతాజీ నగర్ ప్రాంతంలో ఏర్పడే ముంపు సమస్యను నివారించడానికి ఆవ కాలువలో గత నెలలో పూడిక తీత పనులు ప్రారంభించారు. కానీ అవి ఇప్పటివరకు పూర్తికాకపోవడంతో ప్రజలు నిరాశ చెందుతున్నారు. ఒక పక్క వర్షాలు మొదలు కావడం, పూడిక తీత పూర్తికాక పోవడంతో ఆందోళన చెందుతున్నారు. అలాగే బొమ్మూరు వద్ద ఆవ కాలువలో తీసిన పూడికతీత నూతనంగా నిర్మిస్తున్న గ్రావెల్ రోడ్డుపై వేయడంతో నెల రోజులుగా నేతాజీనగర్ వాసులు ఆ రోడ్డులో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు.

వివరాలు ఇవీ..

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ నుంచి మురుగునీరు హుకుంపేట, బొమ్మూరు గ్రామాల మీదుగా ఆవ కాలువ ద్వారా ధవళేశ్వరంలోని సాయిబాబా గుడి వద్ద గోదావరిలో కలుస్తుంది. వర్షాలు కురిస్తే హుకుంపేట రామకృష్ణనగర్, సావిత్రి నగర్, బొమ్మూరు నేతాజీనగర్ ప్రాంతాలు ముంపునకు గురవుతాయి. హుకుంపేట ఆవ కాలువ వద్ద ఆక్రమణలు తొలగించడంతో కొంత మేర ఈ ప్రాంతంలో ముంపు సమస్య తలెత్తదు. అయితే బొమ్మూరులో ముంపు సమస్య నివారణ కోసం హుకుంపేట వరలక్ష్మి కాలనీ నుంచి బొమ్మూరు నేతాజీ నగర్ ఆవ కాలువ వరకు పూడిక తీత పనులకు గత నెల 13న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆదేశాల మేరకు రాష్ట్ర టీడీపీ వైద్య విభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్ కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. అయితే ఇప్పటి వరకూ ఆవకాలువ పూడికతీత పనులు పూర్తి కాలేదు. ఒక పక్క వర్షాలు కురుస్తుండడంతో నేతాజీ నగర్ ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



గ్రావెల్ రోడ్డుపై డంప్ చేసిన ఆవ కాలువ పూడిక

గ్రావెల్ రోడ్డుపై పూడిక

బొమ్మూరు నేతాజీ నగర్ వాసుల కోసం ఎమ్మెల్యే గోరంట్ల వంతెన వద్ద నుంచి సెయింటాన్, గురుకులం వెనుక నుంచి బాలాజీపేట సెంటర్‌కు గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. గ్రావెల్ రోడ్డు వేయడంతో నేతాజీ నగర్ వాసులు ఈ రోడ్డులో రాకపోకలు సాగిస్తున్నారు. అయితే ఆవ కాలువలో తీసిన పూడికతీత మట్టిని గ్రావెల్ రోడ్డుపై వేశారు. గత నెల రోజులుగా ఈ పూడిక మట్టిని తొలగించకపోవడంతో నేతాజీ నగర్ వాసుల రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. పూడికతీత తీసిన సదరు కాంట్రాక్టరు గ్రావెల్ రోడ్డుపై వేసిన మట్టిని తరలించకపోవడంతో నేతాజీ నగర్ వాసులు ఇబ్బందులు పడుతున్నారు.



పూడిక వేయడంతో రాకపోకలకు వీలుగా లేని గ్రావెల్ రోడ్డు



బొమ్మూరు వద్ద ఆవ కాలువలో పేరుకుపోయిన చెత్త

రాకపోకలు బంద్



ఆవకాలువలో తీసిన పూడికతీత మట్టిని గ్రావెల్ రోడ్డుపై వేసి నెలరోజులవుతోంది. ఇప్పటి వరకూ తొలగించకపోవడంతో ఆ రోడ్డులో నేతాజీ నగర్ వాసుల రాకపోకలు నిలిచిపోయాయి. ఆవకాలువ పూడికతీత పనులను త్వరితగతిన పూర్తి చేసి నేతాజీ నగర్ ప్రాంతం ముంపునకు గురి కాకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపాలి.

– కేవీ సుబ్బారెడ్డి, నేతాజీ నగర్, బొమ్మూరు